క్లుప్తంగా

ఇసుక రవాణాలో వసూళ్లకు పాల్పడితే చర్యలు



ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: ఉచిత ఇసుక రవాణాలో ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీలో భాగంగా గృహ నిర్మాణాల కోసం స్థానిక తాండవనది నుంచి ట్రాక్టర్లు, ఎడ్లంబండితో ఇసుకను తీసుకు వెళ్లవచ్చన్నారు. ఇసుక సరఫరాకు ఎవరైనా ఆటంకాలు సృష్టించినా, డబ్బులు వసూలు చేసినా 94409 00773 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



రామచంద్రపురంలోని కనక దుర్గమ్మకు నైవేద్యంగా పెట్టిన గారెలు

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రపురంలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని వందలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి 18 పసుపు కొమ్ములతో 18 సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉప్పు లేని గారెలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు దేవరబొట్ల రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేములకు మాజీ మంత్రి రాజా పరామర్శ



కేపీ మల్లవరంలో వేముల రాజబాబును పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా

కోటనందూరు: ఇటీవల అస్వస్థతకు గురైన వైఎస్సార్ సీపీ నాయకుడు వేముల రాజబాబును మాజీ మంత్రి దాడిశెట్టి రాజా గురువారం పరామర్శించారు. మండలంలోని కేపీ మల్లవరంలో స్వగృహానికి వెళ్లి రాజబాబుతో మాట్లాడారు. అస్వస్థతకు కారణాలు అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ నాయకులు గొర్లి రామచంద్రరావు, చింతకాయల చినబాబు, వెలగా వెంకటకృష్ణాజీ, నల్లమిల్లి గోవిందు, బొత్స సత్తిబాబు, కొరుప్రోలు కృష్ణ, జిగటాల కోటసత్తిబాబు, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని కలిగి ఉండాలి



నీలాద్రిరావుపేటలో జాతీయ చిహ్నాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి: ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నీలాద్రిరావుపేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ చిహ్నాన్ని గురువారం జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్ల రమేష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం తాళ్లూరు, నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేట, నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాల్లో రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. వైఎస్ ఎంపీపీ కుంచే రాజా, సర్పంచులు ములంపాక సురేష్, కందుల చిట్టిబాబు, సీలామంతుల వీరబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలి

జగ్గంపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ అత్తులూరి నాగబాబు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీపీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీఎస్ చంద్రశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగుకు ఊతం



కొలిమేరులో సాగు చేస్తున్న అరటి తోట



మెట్టలో సాగవుతున్న పందిరి దొండపాదులు

- రాయితీలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు
- పండ్లు, కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్
- సాగుపై ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

తుని రూరల్: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పంటలు సాగు చేస్తే రైతులు లాభాల బాట పట్టవచ్చు. పండ్లు, కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఉత్పత్తికి వినియోగానికి తీవ్ర వ్యత్యాసం ఉండడంతో రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. తక్కువ శ్రమతో పెట్టిన పెట్టుబడికి అధిక ఆదాయం పొందవచ్చు. సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు ఉద్యానశాఖ ద్వారా రాయితీలు అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నాయి. మామిడి, జీడి మామిడి, టిష్యూ అరటి, బొప్పాయి, జామ తోటల విస్తరణ, హైబ్రిడ్ కూరగాయల విత్తనాలు, తీగ జాతి కూరగాయల సాగుకు శాశ్వత పందిళ్లకు మూడేళ్ల పాటు రాయితీలను ఉద్యానశాఖ అందిస్తోంది. మొదట సంవత్సరం మొక్కలు, పందిళ్లు వేసుకునేందుకు రాయితీలు అందించి, మూడేళ్లు ఎరువులకు రాయితీలు ఇస్తున్నారు.

రైతులకు గిట్టుబాటు ధర

మారుతున్న జీవనశైలితో పండ్లు, కూరగాయల వినియోగంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఫలితంగా మార్కెట్‌లో డిమాండ్ పెరిగి గిట్టుబాటు ధరలు పెరుగుతున్నాయి. కొన్ని నెలలుగా పండ్లు, కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయని చెప్పొచ్చు. ఏ రకం పండ్లు కొనుగోలు చేద్దామన్నా కిలో రూ.40 నుంచి రూ.60 ధర పలుకుతున్నాయి. అలాగే కూరగాయల ధరలు కిలో రూ.60 నుంచి రూ.100 మార్కు దాటింది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ధరలు పెరుగుదలతో రైతులకు ఆ స్థాయిలో గిట్టుబాటు ధర లభిస్తుంది. మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉద్యాన పంటలు సాగు చేస్తే గిట్టుబాటు ధరతో పాటు రాయితీలతో రైతులు లాభాలు అర్జించవచ్చు.

ఉద్యాన సాగుకు అందించే రాయితీల వివరాలు

పంట	మొక్కల సంఖ్య హెక్టారుకు	ఖర్చు	మొదటి ఏడాది	రెండో ఏడాది	మూడో ఏడాది
మామిడి	178	రూ.33,250	రూ.7980	రూ.2660	రూ.2660
జీడి మామిడి	278	రూ.50,000	రూ.12 వేలు	రూ.4 వేలు	రూ.4 వేలు
టిష్యూ అరటి	3088	రూ.102462	రూ.30739	రూ.10246	--
బొప్పాయి	3086	రూ.61,655	రూ.18497	రూ.6166	--
జామ	1111	రూ.73,330	రూ.17599	రూ.5866	రూ.5866

పంటల వారీగా వ్యయం, రాయితీలు

హెక్టారులో మామిడి సాగుకు రూ.33,250 వ్యయం అవుతుండగా మూడేళ్లలో రాయితీగా రూ.13,300, జీడి మామిడికి రూ.50 వేలు వ్యయం కాగా రూ.20 వేలు రాయితీ, టిష్యూ అరటికి రూ.1,02,462 వ్యయం అవుతుండగా రాయితీ రూ.40,985, బొప్పాయికి రూ.61,655 ఖర్చు కాగా రాయితీగా రూ.24,663 లభిస్తుంది. జామ సాగుకు రూ.73,330 వ్యయం అవుతుండగా రాయితీ రూ.29,331 మంజూరువుతుంది. కూరగాయల సాగు చేసే రైతులకు విత్తనాలు కొనుగోలుకు రాయితీలు ఇస్తున్నారు. హైబ్రిడ్ కూరగాయల విత్తనాల వ్యయం రూ.6 వేలు అవుతుండగా రాయితీ రూ.3 వేలు, తీగ జాతి కూరగాయల సాగుకు అవసరమయ్యే శాశ్వత పందిళ్లకు రూ.5 లక్షలు వరకు వ్యయం అవుతుంది. ఇందులో రూ.2.50 లక్షలు రాయితీ ద్వారా ఉద్యానశాఖ అందిస్తుంది.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనువుగా రైతులు ఉద్యాన పంటలు పండిస్తే మంచి ఆదాయం లభిస్తుంది. పండ్లతోటల విస్తరణ, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుంది. పంటలను బట్టి మూడేళ్ల పాటు రాయితీలు లభిస్తాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న తరుణంలో ఉద్యాన పంటల సాగు ఉత్తమం. ఆసక్తి గల రైతులు వీహెచ్‌ఏలను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలి. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

రోడ్డుపై గోతులు.. ప్రయాణికులకు వెతలు



తుని-నర్సీపట్నం రోడ్డుపై కాకరాపల్లి శివారులో పడిన భారీ గుంత

కోటనందూరు: తుని-నర్సీపట్నం రోడ్డు పూర్తిగా ఛిద్రం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రతి 10 నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు తిరుగుతుంది. ఇంతటి రద్దీ గల రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఛిద్రమైంది. రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంతలు పడడంతో ఈ రహదారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. మండలంలోని కాకరాపల్లి శివారులో రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఇక్కడ తరచూ ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ ప్రయాణం భయానకంగా మారింది. ఈ రోడ్డు దుస్థితిని ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



ఒంటిమామిడి సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: వచ్చే జమిలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు సూచించారు. మండలంలోని ఒంటిమామిడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కోసం గ్రామస్థాయిలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. అధికార కూటమి ప్రభుత్వం ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా ఎదుర్కొంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం 2027లో జమిలి ఎన్నికలకు సిద్ధమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల వస్తే విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృతనిశ్చయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దూళ్లిపూడి అంజనేయులు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, దడాల విజయ్‌బాబు, సాపిశెట్టి చిన్నా, పెండ్యాల బాబి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, కోట వంశీ, ఫణి శర్మ, చెళ్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు



తునిలో సీసీ రోడ్ల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని/తుని రూరల్/కోటనందూరు: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తుని పట్టణంతో పాటు మండలంలోని రేఖవానిపాలెం, మరువాడ, కోటనందూరు మండలంలోని జగన్నాథపురం, కోటనందూరు గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని తుని పట్టణం, ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు నడిగట్ల అర్జలక్ష్మి, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, గాడి రాజబాబు, చిరంజీవిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

శంఖవరం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని గౌరంపేట, జి.కొత్తపల్లి, శంఖవరం, కత్తిపూడి, వజ్రకూటం గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ ఎన్ఎన్ శర్మ, టీడీపీ నాయకులు బద్ది రామారావు, పర్వత సురేష్, వెన్నా శివ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



ఏలేశ్వరంలో పైప్‌లైన్ నుంచి లీకవుతున్న తాగునీరు



దిబ్బలపాలెంలో కుళాయి వద్ద అపరిశుభ్రత, వృథాగా పోతున్న తాగునీరు

ఏలేశ్వరం: పట్టణంలో ప్రజల దాహార్తిని తీర్చే తాగునీరు వృథాగా పోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రూపులమ్మ గుడి సమీపంలోని జీఎల్ఆర్ ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ట్యాంక్ పైపులు లీకవ్వడంతో పాటు కుళాయిలకు ట్యాప్ లేకపోవడంతో నీరు వృథాగా పోతుంది. ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చే ట్యాంక్ నుంచి నిత్యం తాగునీరు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ట్యాంక్ చుట్టూ మొక్కలు పెరిగిపోయాయి. ట్యాంక్ నిండా చెత్త, నాచు పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. అలాగే దిబ్బలపాలెం, తోటవీధి తదితర ప్రాంతాల్లో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తుప్పలు.. రాకపోకలకు తిప్పలు



ఏలేశ్వరంలో రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు ప్రాజెక్టుకు చెందిన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడం రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సాయిబాబా మెట్ట నుంచి ప్రాజెక్టు గట్లలను ఆనుకుని ఉన్న బీటీరోడ్‌కు ఇరువైపులా విపరీతంగా తుప్పలు పెరిగిపోయాయి. ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా ప్రాజెక్టు సిబ్బందితో పాటు వాకర్స్, సమీపంలో నివాసం ఉంటున్న వారు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పాటు పాముల బెడద ఎక్కువగా ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై ప్రాజెక్టు అధికారులు స్పందించి తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: మండలంలోని తంటికొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ సుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, గోపాలపురం, కోరుకొండ మండలంలోని గరగలంపాలెం, అచ్చియ్యపాలెం, దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట, రమణయ్యపేట, శరభవరం, ఉప్పయ్యపాలెం, కమలంపాలెం, పాత్తుకొండ, దేవారం, పోతవరం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

గొర్రెలను అపహరించిన వ్యక్తుల అరెస్టు

గోకవరం: గోకవరం వారపు సంతలో ఓ రైతుకు చెందిన గొర్రెలను అపహరించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన తర్రా నాగేశ్వరరావు గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. గత నెల 9న అతను నాలుగు గొర్రెలను గోకవరం సంతలోకి విక్రయానికి తీసుకురాగా మూడు గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గోకవరానికి చెందిన బండి పోశియ్య, పసుపులేటి దేవదాసులను గురువారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు గొర్రెలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులను రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



ఎంపీడీఓ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీఓ బి.హరికృష్ణ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎంపీపీ తోట రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, ఏపీఎం శరకణం వేదకుమారి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాటాకిల్లు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన బాషా కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు బషీర్ ఉన్నారు. వీరంతా నిద్రిస్తుండగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం సంభవించినట్టు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

రేపటి నుంచి రీసర్వేపై గ్రామసభలు

తొండంగి: మండలంలోని రెవెన్యూ భూములకు నిర్వహించిన రీసర్వేపై శనివారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మోరార్జీ గురువార తెలిపారు.

మండలంలోని 10 రెవెన్యూ పంచాయతీల్లో ఇప్పటికే రీసర్వే పూర్తి చేశారన్నారు. రీ సర్వేలో రైతులు భూముల వివరాలు, సరిహద్దులు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు తదితర సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 19 నుంచి నవంబర్ 8వ తేదీ వరకూ రోజుకో గ్రామంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గ్రామ సభలు జరుగుతాయన్నారు. 19న ఆనూరు, 22న పైడికొండ, 24న వేమవరం, 26న పి.అగ్రహారం, 28న శృంగవృక్షం, 30న గోపాలపట్నం, నవంబర్ 2న ఎ.కొత్తపల్లి, 5న రావికంపాడు, 7న కొమ్మనాపల్లి, 8న పి.ఇ.చిన్నాయపాలెం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540